క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేష పూజలు




పూజలందుకున్న సాక్షి గణపతి, వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

సన్మానం



ఎంపీడీఓను సత్కరిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా కలెక్టర్ రాజకుమారి గణియా చేతుల మీదుగా ఉత్తమ సేవాపురస్కార అవార్డు అందుకున్న ఎంపీడీఓ గోపికృష్ణను బుధవారం కార్యాలయ సిబ్బంది, మండల ప్రజలు ఘనంగా సన్మానించారు. డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి, కార్యాలయ ఏఓ మధుసూదన్, సీనియర్ అసిస్టెంటు మద్దమ్మ, జూనియర్ అసిస్టెంటు అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్‌తో నీరు ఆదా



పంట నమోదును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి

కొత్తపల్లి: డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకుంటే పంటలకు నీటి తడులు ఇచ్చే క్రమంలో నీరు ఆదా అవుతుందని ఉద్యాన శాఖ అధికారిణి కె.చందన సూచించారు. బుధవారం బావాపురం గ్రామ పరిధిలోని ఉల్లి, బెండ, టమాటా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యాన పంటలను ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని కాల్వలు తీసి బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలరించిన నృత్యప్రదర్శన



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన సూర్య కల్చరర్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. గణపతిప్రార్థన, నమశ్శివాయతే, ఓం నమశ్శివాయ, శివతాండవం, లయిగిరినందిని, మహిషాసురమర్ధిని తదితర గీతాలకు గీతాశ్రీ, విష్ణుప్రియ, శరణ్య, లక్ష్మి, నందిని, నవ్యశ్రీ, గీతాంజలి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

లోకకల్యాణార్థం చండీహోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని కుమ్మరి శాలివాహన సత్రంలో లోకకల్యాణార్థం చండీహోమం నిర్వహించారు. బుధవారం కుమ్మరి శాలి వాహన సత్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో సత్రంలో అర్చకులు శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. తుగ్గలి నాగేంద్ర దంపతులతో పాటు సత్రం అధ్యక్షులు బండారు బిక్షపతి, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, కోశాధికారి రోశయ్య, కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

కొత్తపల్లి: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే దోమలు దరి చేరవని వైద్యాధికారులు దీపా నాగవేణి, జబ్బీర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎర్రమఠం ప్రాథమి ఆరోగ్య కేంద్రం పరిధిల్లోని జానాల గూడెంలో దోమల నివారణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిని కుండల్లో రోజుల తరబడి నిల్వ ఉంచరాదన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు మహమ్మద్‌బేగ్ పాల్గొన్నారు.

వరదరాజస్వామి ప్రాజెక్ట్
కర్షకుల కల్పతరువు



- మెట్టభూముల్లో సిరుల పంటలు
- తొలిసారిగా నిండిన ప్రాజెక్ట్
- 13 గ్రామాలకు తాగు నీరు
- 12 వేల ఎకరాలకు సాగు నీరు
- ముందస్తు సాగునీరు విడుదలతో రైతుల హర్షం

నల్లమల అటవీ పరిధిలోని మునిమడుగుల వాగుపై నిర్మించిన వరదరాజస్వామి ప్రాజెక్ట్ కర్షకులకు కల్పతరువుగా నిలుస్తోంది. నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్‌రిజర్వ్ ప్రాంతంలోని 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాజెక్ట్ కేవలం వర్షాధారంతోనే నిండుతుంది. 0.38 టీఎంసీల సామర్థ్యంతో ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల పరిధిలోని 13,220 ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ అతిచిన్న ప్రాజెక్ట్ 8 చెరువులతో పాటూ, చెరువుల ఆయకట్టు పరిధిలోని దాదాపు 12,092 ఎకరాలకు పుష్కలంగా సాగు నీరు అందిస్తోంది. 20 ఏళ్ల అనంతరం తొలిసారిగా తొలి వర్షానికే ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నిండి జలకళను సంతరించుకోవడంతో ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల ప్రజలు రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తోంది. – ఆత్మకూరు



నిండుకుండలా జలకళ సంతరించుకున్న వరద రాజస్వామి ప్రాజెక్ట్

1948లో కరువు విలయతాండవం చేయడంతో రైతులు సాగు నీటి కోసం అన్వేషించారు. ఆత్మకూరు సమీపంలోని నల్లమల అటవీ పరిధిలో ఉన్న మునిమడుగు వాగు నుంచి ప్రవహించే నీరు ఎంతగానో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి ప్రభుత్వం స్పందించి ప్రొఫెసర్ ఎన్జీ రంగాను ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం గ్రామానికి పంపింది. ఈ ప్రాంత రైతులతో మాట్లాడిన ఎన్జీ రంగా తన నివేదికను తొలిసారిగా 1953లో అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ ప్రాజెక్ట్‌పై స్పందన కనిపించలేదు. అనంతరం వచ్చిన ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య ప్రాజెక్ట్‌పై అనుమతి మంజూరు చేస్తూ జీఓ విడుదల చేయడమే కాకుండా ఆయనే స్వయంగా భూమి పూజ చేస్తారని భావించారు. అయినప్పటికీ ప్రాజెక్ట్ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో మరో మారు రైతులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించడంతో 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఎట్టకేలకు ప్రాజెక్ట్‌కు భూమి పూజ చేశారు. చివరకు 2000లో ప్రాజెక్ట్ పూర్తయి రైతులకు సాగు నీరు అందించడం ప్రారంభించింది.

చెరువులకు పుష్కలంగా నీరు..

వరదరాజస్వామి ప్రాజెక్ట్‌లో నీరు పుష్కలంగా ఉండడంతో 8 చెరువులకు నీరు అందుతుంది. ముఖ్యంగా ఇందిరేశ్వరం చెరువు కింద 582 ఎకరాలకు, వడ్లరామాపురం చెరువు కింద 911 ఎకరాలకు, కురుకుంద చెరువు కింద 1,344 ఎకరాలు, కొట్టాల చెర్వు కింద 477 ఎకరాలు, గువ్వలకుంట్ల చెరువు కింద 555 ఎకరాలు, పాలెంచెరువు 380 ఎకరాలు, కొత్తపల్లి చెరువు కింద 779 ఎకరాలు, బావాపురం చెరువు 111 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ చెరువు ద్వారా రైతులు రెండు పంటలు పండించుకుంటున్నారు.

ముందస్తుగా సాగు నీరు విడుదల

ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు మొక్కజొన్న, వరి పంటలను సాగు చేశారు. ముందస్తు వర్షాలు కురవడంతో పంటలు వేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మునిమడుగుల వాగు నుంచి ప్రాజెక్ట్‌కు వరద నీరు చేరడంతో రైతులకు ముందస్తుగానే సాగు నీరు విడుదల చేశారు. ఈ నీరును చెరువులతో పాటూ చెరువు కింద పొలాలకు వెళ్లడంతో పంట ఏపుగా పెరిగి రైతులు పుష్కలంగా పంటలు పండిస్తున్నారు. మెట్ట భూముల్లో సిరులు కురిపిస్తూ ఒకప్పటి కరువు ప్రాంతంలో ఇప్పుడు సిరుల పంటలు పండిస్తున్నారు. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల దాకా వరి దిగుబడులు సాధిస్తున్నారు. ఇక్కడ పండించిన వరి ధాన్యం ఢిల్లీ, మద్రాస్, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు లాంటి ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది.



గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఇతర భూములకు సాగు నీరు

ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లోని చెరువులతో పాటూ ఇందిరేశ్వరం, గూడెం, వడ్లరామాపురం, కురుకుంద, కొట్టాలచెర్వు, పాలెంచెరువు , గువ్వలకుంట్ల, కొత్తపల్లి, లింగాపురం, వీరాపురం, బావాపురం, లింగాపురం, నందికుంట గ్రామాలకు వరద రాజస్వామి ప్రాజెక్ట్ సాగు నీరు అందిస్తుంది. ప్రాజెక్ట్ కింద ఉండే పొలాలను సస్యశ్యామలం చేసేందుకు వరదరాజస్వామి ప్రాజెక్ట్ కుడి కాల్వ ద్వారా 317 ఎకరాలు, ఎడమకాల్వ ద్వారా 152 ఎకరాలు, వడ్లరామాపురం బ్రాంచ్‌కెనాల్ ద్వారా 3,289 ఎకరాలు, వీరాపురం బ్రాంచ్‌కెనాల్ 5,390 ఎకరాలు, నాన్ ఆయకట్టు చెరువుల కింద 2,944 ఎకరాలు కలిపి మొత్తం 12,092 ఎకరాలకు సాగు నీరు అందుతున్నాయి.

రెండు పంటలు పండుతాయి

వరదరాజస్వామి ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతమైన నల్లమలలో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్ట్ నీరు పుష్కలంగా రావడం వల్ల ఈ ఏడాది ఈ ప్రాజెక్ట్ కింద రైతులు రెండు పంటలు పండిస్తారు. అత్యధికంగా వరి పంట రైతులు సాగు చేశారు. నీరు సమృద్ధిగా రావడంతో పుష్కలంగా పంటలు పండుతాయి.

– శేషిరెడ్డి, రైతు, వడ్లరామాపురం

నీటిని పొదుపుగా వాడుకోండి

ప్రస్తుతం ఈ ఏడాది రైతులకు ముందస్తుగానే సాగు నీరు అందిస్తున్నాం. ఈ నీటిని రైతులు సక్రమంగా వినియోగించుకుని పంటలు పండించాలి. నీటిని వృథా చేయకుండా కాల్వల ద్వారా ఎప్పటికప్పుడు పొలాలను తడపాలి. ఇలా రైతులు వృథా చేయకుండా నీటిని వాడితే రెండు పంటలకు కావాల్సిన నీరు ప్రాజెక్ట్ ద్వారా అందజేస్తాం. – మురళీకృష్ణ, వరదరాజస్వామి ప్రాజెక్టు డీఈ

కేసీ కాల్వకు తగ్గించిన నీటి సరఫరా

జూపాడుబంగ్లా: వర్షాల వల్ల కేసీ కాల్వకు సాగునీటి సరఫరా తగ్గించినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,500 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లాకు 845 క్యూసెక్కులు చేరుతుందన్నారు. ఈ నీటిని నిప్పులవాగుకు 620 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 205 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 20 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

సి.బెళగల్: ఉద్యాన పంటల నిర్వహణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీఓ రామన్న సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం టీఏలు, ఎఫ్ఏలతో పండ్లు, పూల తోటల పెంపకం పనులపై సమీక్ష నిర్వహించారు. ఉద్యాన పంటల పనులు, వాటి రికార్డుల నిర్వహణలో జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు. పనులు పూర్తయిన రైతులకు వేతనాలు అందేలా చూడాలన్నారు. టీఏలు మురళి, గోవర్ధన్, ఉమామహేశ్వరి, లక్ష్మి ఉన్నారు.

నానో యూరియా ద్వారా మంచి ఫలితాలు

మహానంది: రైతులు పంటల సాగులో సాధారణ యూరియా స్థానంలో నానో యూరియా వాడటం ద్వారా మేలైన ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. గోపవరం గ్రామ సమీపంలోని పొలంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలిచ్చారు. నానో యూరియా వాడటం ద్వారా పంటకు 80 శాతం నత్రజని అందుతుందన్నారు. ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించుకోని రైతులు వెంటనే బ్యాంకులకు వెళ్లి చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు కామేశ్వరీదేవికి ప్రత్యేక అలంకరణ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవికి ఈనెల 22న వివిధ రకాల ఫలాలతో ప్రత్యేక అలంకరణ ఉంటుందని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని బుధవారం తెలిపారు.

ఈ దారిలో ప్రయాణం సాగేదెలా?



గుంతల మయంగా ఉన్న ప్రధాన రహదారి

పాములపాడు: మండల కేంద్రం నుంచి చెలిమిల్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణం అంటేనే ఒళ్లు హూనమవుతోంది. నేషనల్ హైవే 340 సీ నిర్మాణ పనులకు ప్రతి రోజు వందల సంఖ్యలో గ్రావెల్ తరలిస్తున్న భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ఛిద్రమైంది. దీనికి తోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డుపై ఉన్న గోతుల్లో వర్షపు నీరు చేరాయి. చెలిమిల్లతో పాటు లింగాల గ్రామానికి, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు ఇదే రహదారిపైనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం భవనాశి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇస్కాల గ్రామ ప్రజలు చెలిమిల్ల మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. గుంతల్లో వర్షపు నీరు చేరడం వల్ల వాహనాలు ఎక్కడ ప్రమాదానికి గురవుతాయోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సత్వరమే రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎలుకల నివారణకు చర్యలు

బండి ఆత్మకూరు: పంట పొలాల్లో ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ పవన్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. వరి పంటలో ఎలుకల నివారణకు బ్రోమోడీయోలిన్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. 96 శాతం నూకలు, 2 శాతం నూనెతో కలిపి ఈ మందును కలిపి విషపు ఎరగా తయారు చేసి పొలం గట్ల వెంట ఉన్న బొరియల్లో పెట్టాలని సూచించారు.

చీడపీడల నివారణ చేపట్టాలి

పగిడ్యాల: ఖరీఫ్ సీజన్ వర్షాధారం, కేసీ ఆయకట్టు కింద సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలకు ఆశించే చీడపీడలను సకాలంలో నివారించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ సూచించారు. బుధవారం నెహ్రూనగర్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం కేసీ ఆయకట్టు కింద రైతాంగం వరి నాట్లు వేస్తున్నారని, ఎక్కువ కుచ్చు పెట్టకుండా తక్కువ కర్రలు నాటుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు. మందులు చల్లుకోవడానికి, పిచికారీ చేసుకోవడానికి సాళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రమేష్‌బాబు, రాము పాల్గొన్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలి



బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జూపాడుబంగ్లా: రీవెరిఫికేషన్ పేరుతో తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి ఆయన బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా ఉన్నవాటిని తొలగించడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఉన్నఫలంగా పింఛన్‌లు తొలగిస్తే వృద్ధులు, ఒంటి మహిళలు, వికలాంగులు జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్‌లోని వైకల్యం శాతాన్ని ఇప్పుడు తగ్గించడం ఎంత వరకు సమంజసమన్నారు. పింఛన్లను పునరుద్ధరించకపోతే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఐ నాయకులు మగ్బుల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలతో దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: రీవెరిఫికేషన్‌లో తొలగించిన పింఛన్ల లబ్ధిదారులు అర్హత ఉంటే ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణ బుధవారం తెలిపారు. మరోసారి నంద్యాల జిల్లా ఆసుపత్రి వైద్యులు పరిశీలించి అర్హత ఉన్నట్లయితే పింఛన్ పునరుద్ధరించే అవకాశం ఉందన్నారు. దరఖాస్తుతో పాటు సచివాలయంలో ఇచ్చిన పెన్షన్ తొలగింపు నోటీసు, ఆధార్‌కార్డు, సదరం క్యాంపు సర్టిఫికెట్ల జిరాక్సులను జతపరచి ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎస్ఆర్ఎంసీలోకి లీకేజీ నీరు

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల రస్తాలో సూపర్‌ప్యాసేజ్ వంతెన వద్ద ఎస్ఆర్ఎంసీ కాలువలోకి వర్షపు నీరు సైడ్‌బండ్ ద్వారా లీకై వస్తోంది. భారీ వర్షాలు కురిసిన సమయంలో నల్లమల అటవీ ప్రాంతం నుంచి వర్షపు నీరు భవనాశి నదిలోకి చేరుతుంది. ఈ నీరు అధికమై పక్కనున్న పొలాల్లో చేరుతోంది. ఈ నీరు సైడ్ బండ్ ద్వారా ఎస్ఆర్ఎంసీ కాలువలోకి లీకేజీతో చేరుతుంది. ఈ విధంగా నీరు లీకవడంతో సైడ్ బండ్ బలహీనమయ్యే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు సత్వరమే చర్యలు తీసుకుని లీకేజీని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



లీకేజీతో ఎస్ఆర్ఎంసీలోకి చేరుతున్న వర్షపు నీరు

వారపు సంత.. సమస్యల పుంత



బురదమయమైన పగిడ్యాల సంతమార్కెట్

పగిడ్యాల: మండలంలో నిర్వహించే వారపు సంతలు సమస్యల పుంతగా మారాయి. నెహ్రూనగర్, పాత ముచ్చుమర్రి, పగిడ్యాల, పడమర ప్రాతకోట గ్రామాల్లో వారపు సంతలను నిర్వహిస్తారు. వారపు సంతల్లో చిరు వ్యాపారులకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. మహిళా వ్యాపారులకు టాయిలెట్లు, మరుగుదొడ్లు లేకపోవడం, సరుకులను విక్రయించుకోవడానికి సరైన ప్లాట్ ఫారంలు లేనందున వ్యాపారులు ఎదుర్కొంటున్న బాధలు వర్ణణాతీతం. నెహ్రూనగర్, పడమర ప్రాతకోట గ్రామాల్లో ప్రతి మంగళవారం వారపు సంత జరుగుతోంది. ఈ గ్రామాల్లో సంతమార్కెట్‌కు స్థలం లేకపోవడంతో ప్రధాన రహదారి పొడువునా వ్యాపారులు కూరగాయలు, మసాల దినుసులు, కిరాణం సరుకుల విక్రయదారులు కుప్పలుగా పోసుకుని విక్రయిస్తున్నారు. ఏడాదికోసారి సంత మార్కెట్ వేలాలు నిర్వహించే పంచాయతీ అధికారులు వేలల్లో ఆదాయం పొందుతున్నా వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు రోజులుగా కురుకుస్తున్న ఎడతెరిపినివ్వని వర్షాలకు సంతమార్కెట్ బురదమయంగా తయారైంది. కొనుగోలుదారులు బురదలో నడవడానికి పలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వారపు సంతల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయా గ్రామాల వ్యాపారులు కోరుతున్నారు.

లబ్ధిదారుల కడుపు కొట్టడం తగదు



బాధితులతో కలిసి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: రీవెరిఫికేషన్ పేరుతో పింఛన్లు తొలగించి లబ్ధిదారుల కడుపు కొట్టడం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి నాగార్జున రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వర రెడ్డి, మండల కన్వీనర్, మండల ఉపాధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ వెంకటరమణ అన్నారు. బాధితులతో కలిసి వారు ఎంపీడీఓ గోపికృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారుల పింఛన్లు తొలగించి పింఛన్ పెంచామని గొప్పలు చెప్పుకోవటం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తామన్న చంద్రబాబునాయుడు ఇప్పటిదాకా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయలేదన్నారు. తొలగించిన లబ్ధిదారుల పింఛన్లు సత్వరమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాస్కరాపురం కదిరి పుల్లయ్య, తూడిచెర్ల గోపాల్‌రెడ్డి, పి.లింగాపురం, మండ్లెం, తాటిపాడు తదితర గ్రామాలకు చెందిన బాధితులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై సర్కారు కాఠిన్యం

- రీవెరిఫికేషన్ పేరుతో వికలత్వం శాతం తగ్గింపు
- దాన్ని సాకుగా చూపుతూ పింఛన్ల తొలగింపు
- ఇప్పటికే నోటీసులు జారీ

కొత్తపలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లలో కోత పెట్టింది. గత ప్రభుత్వంలో సదరం ద్వారా పొందిన పింఛన్లపై మరో మారు సదరం క్యాంప్‌లు ఏర్పాటు చేసి చాలా మందిని తొలగించడమే గాక, ఎంతోమందికి వైకల్య శాతం తగ్గించారు. దీంతో దివ్యాంగులు మండిపడుతున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 2,830 మంది వికలాంగులు ఉన్నారు. వీరందరికి వికలాంగుల కోటాలో ఎన్నో ఏళ్ల తరబడి పింఛన్ పొందుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్ల ఏరివేతకు సిద్ధమైంది. సుమారు 480 మంది వికలాంగ లబ్ధిదారుల పింఛన్లు జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణలో ఓ సర్వే చేయించి అనర్హులుగా గుర్తించామని, పింఛన్లను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. నందికొట్కూరు 121, పగిడ్యాల 42, మిడుతూరు 97, జూపాడుబంగ్లా 85, పాములపాడు 75, కొత్తపల్లి మండలంలో 60 మందిని సర్వేచేసి అనర్హులుగా గుర్తించి వారి పింఛన్లు తొలగిస్తున్నట్లు లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసింది. మామూలుగా వికలాంగులు పింఛన్ పొందాలంటే 40 శాతం పైన వికలత్వం ఉండాలి. ఈ వికలత్వాన్ని ప్రభుత్వ వైద్యాధికారులచే సదరం క్యాంపులో పొందాల్సి ఉంటుంది. అలా వైద్యాధికారుల ద్వారా 40 శాతం కన్న ఎక్కువ వికలత్వం ఉన్నట్లు ధ్రువపత్రాలు సమర్పించి పింఛన్ పొందుతున్న వారివి కూడా తొలగిస్తే ఎలా అని ప్రభుత్వాన్ని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

రీవెరిఫికేషన్‌లో 40 శాతం కన్న తక్కువ వికలత్వం ఉన్నవారిని గుర్తించి నోటీసులిచ్చాం. ఒకవేల అర్హత ఉంటే ఆధారాలతో సచివాలయాల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను జిల్లా వైద్యాధికారులకు పంపుతాం. వారు సదరం క్యాంప్‌కు పిలిచి వికలత్వాన్ని మరోసారి నిర్ధారిస్తారు. అర్హత ఉంటే పింఛన్ పునరుద్ధరిస్తాం.

– సయ్యద్ అబ్దుల్ అల్లాం బాషా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, కొత్తపల్లి

పింఛన్ తొలగించారు



నాకు ఒక కన్ను పూర్తిగా తొలగించి గాజు కన్ను వేశారు. సదరం క్యాంప్‌లో డాక్టర్లు 70 శాతం వికలత్వం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. దాంతో 15 ఏళ్ల నుంచి వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నాను. ఇప్పుడు పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసు ఇచ్చారు. అధికారులు పింఛన్ పునరుద్ధరించి నాకు న్యాయం చేయాలి.

– బట్టు రాజు, గువ్వలకుంట్ల వికలాంగ పింఛన్‌దారుడు

పింఛనే ఆధారం



నాకు మూడేళ్ల క్రితం యాక్సిడెంట్‌లో కాలు విరిగిపోయింది. రాడ్లు వేశారు. ఇప్పుడు ఏ పని చేయలేను. గతంలో సదరం క్యాంపులో డాక్టర్లు నాకు 55 శాతం వికలత్వం ఉందని సర్టిఫికెట్ ఇవ్వడంతో పింఛన్ మంజూరైంది. దాంతోనే మందులు, ఇంటి ఖర్చులకు సర్దుబాటు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఇప్పుడు నా పింఛన్ తొలగించారు. అధికారులు దయతలచి పింఛన్ పునరుద్ధరించాలి.

– మద్దిలేటి, 80 బన్నూరు గ్రామం, జూపాడుబంగ్లా మండలం

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నందికొట్కూరు: మండల పరిధిలోని శాతనకోట, అల్లూరు గ్రామ సమీపంలోని వర్షం నీటిలో ఉన్న మొక్కజొన్న పంటలను ఏరువాక కేంద్రం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జిల్లా ప్రధాన శాస్త్రవేత్తలు వెంకటరమణ, అరుణ్‌కుమార్, రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో వర్షం నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలని రైతులకు సూచించారు. రెండు రోజులకు మించి మొక్కజొన్న చేనులో వర్షపు నీరు నిలిస్తే పంట దిగుబడికి నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ గిరీష్ పాల్గొన్నారు.